క్లుప్తంగా

పశువులకు టీకాలు తప్పనిసరి



సత్యవాడలో పశువుకు టీకా వేస్తున్న ఎంపీపీ నాగమణి

కె.గంగవరం: పాడి రైతులు నిర్లక్ష్యం వహించకుండా పశువులకు తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని ఎంపీపీ పంపన నాగమణి సూచించారు. మండలంలోని సత్యవాడలో సోమవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలి కుంటి వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా పశువులకు టీకాలు వేస్తుందన్నారు. పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీసీ నాయకుడు పంపన సుబ్బారావు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్ పుట్టిన రోజు వేడుకలు

కాజులూరు: మండలంలోని ఆర్యావటం, గొల్లపాలెం, కాజులూరు తదితర గ్రామాల్లో సోమవారం డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. పవన్‌కల్యాణ్ అభిమాన సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన సేవా కార్యక్రమాల్లో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, నియోజకవర్గ జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, చిక్కాల దొరబాబు పాల్గొన్నారు. పేదలు, వృద్ధులకు పండ్లు, దుస్తులు, విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. పలు చోట్ల మొక్కలు నాటారు.

కె.గంగవరం: మండలంలోని పామర్రు, అముజూరు, సత్యవాడ గ్రామాల్లో సోమవారం జనసేన అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. జనసేన రామచంద్రపురం ఇన్‌చార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్ కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కోటిపల్లిలో జరిగిన వేడుకల్లో మంత్రి వాసంశెట్టి సుభాష్ పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో అన్నదానం నిర్వహించారు. పలు గ్రామాల్లో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహించారు.

డ్రైనేజీ మూసుకుపోయి ఇబ్బందులు

అమలాపురం రూరల్: కదలి గ్రామం అరవపాలెంలో చింతపల్లి నుంచి పొన్నమండ వరకూ వెళ్లే ప్రధాన మురికికాలువలో కలిసే నామాన పాలెం డ్రైనేజీ గుర్రపు డెక్క, తూడుతో మూసుకుపోవడంతో ముంపు నీరు దిగడం లేదని రైతులు అరవ సత్యనారాయణస్వామి, గరవ ప్రసాద్, బళ్ల సూర్యారావు తదితరులు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజాపరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. దీనివల్ల 120 ఎకరాల మేర ఆయకట్టు ముంపు బారిన పడుతుందని, సమస్య పరిష్కరించాలని కోరారు. అలాగే అమలాపురం మున్సిపాలిటీలోని 29వ వార్డు సావరం రోడ్డులో కేటరింగ్ సెంటర్ నడుపుతున్న ఒక వ్యక్తి కాలనీ రోడ్డు ఆక్రమించి ఇబ్బందులు పెడుతున్నారని 29వ వార్డు కౌన్సిలర్ చిత్రపు రామకృష్ణ, కాలనీ వాసులు గణేష్, మణికంఠ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్ట్

రావులపాలెం: గ్రామంలోని కొత్త కాలనీలో ప్రభుత్వ స్కూల్ పక్కన పేకాట ఆడుతున్న ఐదుగురు యువకులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.700 నగదు స్వాధీనం చేసుకున్నట్టు టౌన్ సీఐ జేమ్స్ రత్న ప్రసాద్ సోమవారం తెలిపారు.



ద్రాక్షారామలో వైఎస్సార్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న సూర్యప్రకాశ్, నాయకులు



పల్లిపాలెంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



దుగ్గుదుర్రులో మహానేత విగ్రహానికి నివాళులర్పించిన నాయకులు



కపిలేశ్వరపురం మండలం, అంగరలో వైఎస్సార్‌కు నివాళి అర్పిస్తున్న నాయకులు

మహానేతా.. మనసాస్మరామీ!

- వాడవాడలా వైఎస్సార్ వర్ధంతి
- రాజన్నకు నివాళులర్పించిన నాయకులు, ప్రజాప్రతినిధులు
- గ్రామాల్లో సేవా కార్యక్రమాలు

రామచంద్రపురం: పేదల ఆశాజ్యోతి, అభివృద్ధి ప్రదాత దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని సోమవారం రామచంద్రపురం నియోజకవర్గంలో వాడవాడలా నిర్వహించారు. పట్టణంలోని గాంధీ నగర్‌లో వైఎస్సార్ చిత్రపటానికి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త పిల్లి సూర్యప్రకాశ్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదురుగా గల డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహానేత రాజశేఖరరెడ్డి సంక్షేమ సారథిగా ఎన్నో పథకాలను అమలు చేసి పేదల హృదయాల్లో చెరగని ముద్రవేశారని కొనియాడారు. ఆరోగ్య శ్రీ, ఫీజు రియింబర్స్‌మెంట్ వంటి పథకాలను ప్రవేశపెట్టి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి, ఎంపీపీ అంబటి భవానీ, వైస్ చైర్మన్లు చింతపల్లి నాగేశ్వరరావు, కోలమూరి శివాజీ, కౌన్సిలర్ కేతా శ్రీను, పార్టీ పట్టణ కన్వీనర్ గాధంశెట్టి శ్రీధర్, పెట్టా శ్రీనివాసరావు, వల్లు శివ, కట్టా గోవిందు తదితరులు పాల్గొన్నారు.

కె.గంగవరం: మండలవ్యాప్తంగా సోమవారం దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని నిర్వహించారు. కె.గంగవరం బీసీ కమ్యూనిటీ హాలు వద్ద వైఎస్సార్ విగ్రహానికి ఎంపీపీ పంపన నాగమణి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదల జీవితాల్లో వెలుగులు నింపిన మహానేత వైఎస్సార్ అన్నారు. భౌతికంగా ఆయన మరణించినా ప్రతి ఒక్కరి మనసులో బతికేఉన్నారన్నారు. సొసైటీ మాజీ అధ్యక్షులు సాదా వెంగళరావు, ఈదర రమేష్, జత్తుక శ్యాంప్రసాద్, కోటి వెంకట్రావు పాల్గొన్నారు. అద్దంపల్లిలో వైస్ ఎంపీపీ దూడల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. పూలమాల వేసి నివాళులర్పించారు. కూళ్ల, యర్రపోతరం, దంగేరు, కుడుపూరు, తాళ్ల పోడు, భట్లపాలిక, మసకపల్లి, అద్దంపల్లి, బాలాంత్రం తదితర గ్రామాల్లోనూ వైఎస్సార్ వర్ధంతి నిర్వహించారు.

ప్రజల గుండెల్లో మహానేత పదిలం

రామచంద్రపురం రూరల్: సంక్షేమ సారథి వైఎస్ రాజశేఖరరెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ వంటి పథకాలను అమలు చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిలో నిలిచిపోయారని వైఎస్సార్ సీపీ రామచంద్రపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. ద్రాక్షారామలో సోమవారం మహానేత వైఎస్సార్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సూర్యప్రకాశ్ మాట్లాడుతూ పేదల పిల్లలు ఇంజినీరింగ్, వైద్యం తదితర ఉన్నత చదువులు చదువుకుని, ఉన్నత ఉద్యోగాలు పొందడం ద్వారా వారి కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేసిన మహనీయుడు వైఎస్సార్ అన్నారు. అనారోగ్యం వస్తే అప్పుల పాలై ఆర్థికంగా చితికిపోతున్న పేదల కుటుంబాలను ఆరోగ్యశ్రీ పథకంతో ఆదుకున్నారన్నారు. పేదలకు సైతం కార్పొరేట్ వైద్యం అందించారని కొనియాడారు. జోహార్ వైఎస్సార్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీ శాకా బాబీ, సర్పంచులు అంబటి తుకారం, పెమ్మిరెడ్డి దొరబాబు, ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



రామచంద్రపురం గాంధీనగర్‌లో వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సూర్యప్రకాశ్ తదితరులు

పేదల ప్రజల గుండె చప్పుడు వైఎస్సార్

మండపేట: పేదల గుండె చప్పుడు వైఎస్ రాజశేఖరరెడ్డి అని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గా రాణి అన్నారు. మాజీ సీఎం, దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి 15వ వర్ధంతిని వైఎస్సార్ సీపీ శ్రేణులు సోమవారం మండపేట పట్టణంలో నిర్వహించాయి. 28వ వార్డు కౌన్సిలర్ మొండి భవానీ మురళి దంపతులు, వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

కార్యక్రమంలో చైర్‌పర్సన్ దుర్గారాణితో పాటు ఆ పార్టీ యువనేత తోట పృథ్వీరాజ్, సీనియర్ నేతలు రెడ్డి రాధాకృష్ణ (రాజబాబు), వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి పాల్గొన్నారు. స్థానిక రాజారత్న రోడ్డు వైఎస్సార్ జంక్షన్ వద్ద గల మహానేత వైఎస్ విగ్రహానికి వారంతా పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు, నాయకులు పెంకే గంగాధర్, మీగడ శ్రీనివాస్, పిఠాపురం సత్యనారాయణ, కనికెళ్ల ప్రసాద్, జొన్నపల్లి సత్తిబాబు, వల్లూరి రామకృష్ణ, షేక్ అలీఖాన్‌బాబా, సాధనాల శివ భగవాన్, అధికారి శ్రీనివాస్, శెట్టి నాగేశ్వరరావు, వంగా శ్రీనివాస్, సిరిపురపు శ్రీనివాస్, యరమాటి వెంకన్నబాబు, కొడమంచిలి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



కె.గంగవరంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ నాగమణి తదితరులు

మండలంలో..

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆదేశాల మేరకు మండలంలోని ఏడిద, ద్వారపూడి, కేశవరం గ్రామాల్లో వైఎస్ రాజశేఖరరెడ్డి 15 వర్ధంతిని సోమవారం నిర్వహించారు. మూడు గ్రామాల్లోను వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వైస్ ఎంపీపీ పసుమర్తి నాగేశ్వరరావు, ద్వారపూడి సర్పంచ్ ఈతకోట కిన్నెర, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. కుడుపూడి రాంబాబు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు తుపాకుల ప్రసన్నకుమార్, అబ్బిరెడ్డి వీర్రాజు, యడ్ల రవి, కొక్కిరి శేఖర్, ద్వారపూడి ఉప సర్పంచ్ తులాశేషరావు, రమణ, ఏడిద సొసైటీ ప్రెసిడెంటు రామిశెట్టి శ్రీహరి పాల్గొన్నారు.

రాయవరం: మండలంలోని గ్రామగ్రామానా రైతు బాంధవుడు వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని సోమవారం నిర్వహించారు. రాయవరంలో వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు తమలంపూడి గంగాధరరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ విగ్రహానికి పారిశ్రామికవేత్త తేతల సుబ్బరామారెడ్డి, ఎంపీపీ నౌడు వెంకటరమణ, సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు తదితరులు నివాళి అర్పించారు. పార్టీ నేతలు పులగం శ్రీనివాసరెడ్డి, బొడ్డు శ్రీను, పీఎస్ఆర్, మండపల్లి కొండలరావు, కొల్లి రాంబాబు, బొడ్డపాటి సురేష్‌కుమార్ పాల్గొన్నారు. సోమేశ్వరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కొళ్ల అప్పారావు, ఎస్ఎంసీ చైర్మన్ జోడా గణేష్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కోట వెంకట్రావు, పార్టీ నాయకులు కర్రి ఆదినారాయణరెడ్డి త పాల్గొన్నారు. కురకాళ్లపల్లిలో ఉప సర్పంచ్ పితాని ప్రసాద్, మాజీ ఎంపీపీ రాయుడు సత్యనారాయణ ఆధ్వర్యంలో వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాచవరం, పసలపూడి తదితర గ్రామాల్లోనూ మహానేత వైఎస్ వర్ధంతి నిర్వహించారు.

కాజులూరు: మండలంలోని గొల్లపాలెంలో వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి పోతురాజు బాబురావు ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మొగలిపాలెంలో పార్టీ గ్రామ కమిటీ చైర్మన్ తాడి గనిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా నాయకుడు కర్రి బస్వీరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మహానేత విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుయ్యేరులో మేకల శ్రీనివాసు, దుగ్గుదుర్రులో పార్టీ నాయకుడు పోతు శ్రీనివాసు, కాజులూరులో ఎంపీపీ మాత భారతీమురళీ, పల్లిపాలెంలో ఎంపీటీసీ మేడిశెట్టి శ్రీను ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్యమంత్రిగా వైఎస్సార్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమాల్లో పీఏసీఎస్ మాజీ చైర్మన్ డాక్టర్ సత్తి శ్రీరామారెడ్డి, దంగేటి వెంకన్న, డేగల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: మండలంలోని 19 గ్రామాల్లో సోమవారం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 15వ వర్ధంతిని నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ విగ్రహాల వద్ద నివాళి అర్పించారు. కపిలేశ్వరపురం, తాతపూడి, అంగర, వెదురుమూడి, వల్లూరు, నేలటూరు, వడ్లమూరు, అచ్యుతాపురం, నిడసనమెట్ట, కాలేరు, నల్లూరు, టేకి, మాచర, కోరుమిల్లి, వాకతిప్ప, అద్దంకివారిలంక, కేదారిలంక గ్రామాల్లో ప్రజలు వైఎస్ వర్ధంతి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయన అమలు చేసిన సంక్షేమ పథకాలను జ్ఞాపకం చేసుకున్నారు. కార్యక్రమంలో పుట్టా కృష్ణమూర్తి, మేడిశెట్టి దుర్గారావు, పాలింగి కృష్ణకిశోర్, పోలిశెట్టి గణేష్, పసలపూడి శ్రీనివాసరావు, తిరునాతి వెంకటేశ్వర్లు, వాసంశెట్టి విష్ణుమూర్తి, పాలింగి శ్రీనివాస్, కరెడ్ల శ్రీనుబాబు, వాసా కోటేశ్వరరావు, యర్రంశెట్టి నాగేశ్వరరావు, మేడిశెట్టి దుర్గారావుపాల్గొన్నారు.



మండపేటలో వైస్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



రాయవరంలో వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న నాయకులు

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం

రాయవరం: నేటి ఆధునిక యుగంలో ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలని యోగా గురువు వెలగల ఫణికృష్ణారెడ్డి, పిరమిడ్ మాస్టర్ ఝాన్సీ పేర్కొన్నారు. స్థానిక సత్యసాయి సేవా మందిరం వద్ద వెలగల వెంకటరెడ్డి స్మారక పిరమిడ్ ధ్యాన మందిరం వద్ద సోమవారం ధ్యాన తరగతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఫణికృష్ణారెడ్డి, ఝాన్సీలు మాట్లాడుతూ ప్రతి నెలా అమావాస్య రోజున నిర్వహిస్తున్న పిరమిడ్ ధ్యాన కేంద్రాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని, ఒత్తిడి నుంచి ఉపశమనం పొందాలన్నారు. అనంతరం ధ్యాన సభ్యుల సమక్షంలో సత్యసాయి సేవా మందిరం అధినేత కాశీ విశ్వనాథ్‌ను, పిరమిడ్ మాస్టర్ ఝాన్సీని ఫణికృష్ణారెడ్డి, సీత దంపతులు సత్కరించి, జ్ఞాపికలు బహూకరించారు. కార్యక్రమంలో రాయవరం, వెదురుపాక, సోమేశ్వరం, మాచవరం తదితర గ్రామాలకు చెందిన 52 మంది సభ్యులు పాల్గొన్నారు.



కాశీవిశ్వనాథ్‌ను సత్కరిస్తున్న ఫణికృష్ణారెడ్డి, సీత దంపతులు

దేశాభివృద్ధిలో పౌరులు భాగస్వాములు కావాలి

జమాతే ఇస్లామీ హింద్ జాతీయ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ సలీం ఇంజినీర్

మండపేట: దేశాభివృద్ధిలో పౌరులంతా భాగస్వాములు కావాలని జమాతే ఇస్లామీ హింద్ జాతీయ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ సలీం ఇంజినీర్ అన్నారు. రాష్ట్ర వ్యాప్త పర్యటనలో భాగంగా సోమవారం ఆయన మండపేట సందర్శించారు. పట్టణ జమాత్ సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. గాంధీనగర్ చిన్న మసీదు ఆవరణలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సామాజిక రుగ్మతల నిర్మూలనకు అన్నిమతాల గురువులు సంయుక్త వేదిక ద్వారా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. దీని కోసం రాష్ట్రంలో ధార్మిక సత్సంగ వేదిక కూడా ఏర్పడిందన్నారు. నైతికతే నిజమైన స్వేచ్ఛ పేరుతో దేశవ్యాప్త జాగృతి ఉద్యమం నిర్వహిస్తుందన్నారు. దీనికి ప్రజలంతా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రంలో ప్రస్తుతం వరద ప్రభావిత ప్రాంతాల్లో జమాత్ శ్రేణులు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని జమాతే ఇస్లామీ హింద్ రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ రఫీఖ్ అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా బాధ్యులు అమీర్, పట్టణ అధ్యక్షుడు అబుల్ అలా, కోనసీమ జిల్లా జమాత్ సభ్యులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న సలీం ఇంజినీర్

శబరిమలకు సైకిల్‌పై పయనం



శబరిమలకు సైకిల్‌పై వెళ్తున్న అయ్యప్ప స్వాములు

మండపేట: పట్టణానికి చెందిన శ్రీనివాస్, సతీష్ అనే అయ్యప్పధారులు సైకిళ్లపై శబరిమల యాత్రకు పయనమయ్యారు. గుమ్మిలేరు రోడ్డులోని అయ్యప్ప దేవాలయం నుంచి సోమవారం వారిద్దరూ శమరిమల సైకిల్ యాత్ర చేపట్టారు. జనసేన పార్టీ మండపేట నియోజకవర్గ ఇన్ చార్జ్ వేగుళ్ల లీలాకృష్ణ వారి యాత్రను పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ, టీడీపీ, జనసేన నాయకులు నామాల చంద్రరావు, బొమ్మన సతీష్, సిరంగు ఈశ్వరరావు, స్వాములు లాయర్ మహేష్, అయ్యప్ప ఆలయ గురుస్వామి నంబూద్రి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

భవనాన్ని అందుబాటులోకి తేవాలి

అమలాపురం టౌన్: గత ప్రభుత్వంలో రూ.2 కోట్ల నిధులతో స్థానిక మున్సిపల్ కాలనీలో నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్ భవనాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. జిల్లా సీపీఎం నాయకుల బృందం భవనాన్ని సోమవారం పరిశీలించింది. కూటమి ప్రభుత్వం భవాన్ని ఇలాగే వదిలేస్తే శిథిలావస్థకు చేరుకుంటుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతానికి కుళాయి చెరువు వద్ద గల కచేరి చావిడి భవనంలో అరకొర సౌకర్యాల నడుమ అర్బన్ హెల్త్ సెంటర్ నిర్వహిస్తున్నారన్నారు. తక్షణమే సొంత భవనంలోకి అర్బన్ హెల్త్ సెంటరును మార్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా ప్రతినిధులు జి.దుర్గాప్రసాద్, పాలమూరి శ్రీనివాసరావు, కె.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జనరిక్ మందులు మేలు..

- గ్రామాల్లో సీజనల్ వ్యాధుల ప్రభావం
- పెరిగిన మందుల అవసరం
- బ్రాండెడ్ మందుల కొనుగోలుతో ఆర్థిక భారం
- జనరిక్ షాపుల్లో 10 నుంచి 80 శాతం ధరల తగ్గుదల



కపిలేశ్వరపురం: సమాజంలో మంచి విషయాలు పెద్దగా ప్రచారంలో ఉండవు. హంగు, ఆర్భాటాలు, పెద్దగా అవసరం లేని విషయాలు హల్ చల్ చేస్తుంటాయి. ఆరోగ్య సమస్య రాగానే నేరుగా షాపు వద్దకు వెళ్లి మందులను తెచ్చుకుంటుంటారు. మందుల దుకాణాల్లో లభ్యమయ్యే మందులు బ్రాండెడ్‌వి కావడంతో అవి అధిక ధరలతో విక్రయిస్తారు. సామాన్యులకు అందుబాటులో ఉండేలా జనరిక్ మందులు సైతం మార్కెట్‌లో లభ్యమవుతున్నాయి. సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న నేపథ్యంలో జనరిక్ మందులపై అవగాహన అవసరం. జనరిక్ మందుల వినియోగాన్ని పెంచాలన్న లక్ష్యంతో 2023లో నేషనల్ మెడికల్ కమిషన్ రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్స్ (ఎన్ఎంసీఆర్ఎంపీ) ఎన్ఆర్సీఆర్ఎంపీ నియమావళి–2023 ను తీసుకొచ్చింది.

నేపథ్యమిదీ..

సామాన్యులకు తక్కువ ధరలకే ఔషధాలను అందించాలన్న ప్రధాన లక్ష్యంతో 2015లో జనరిక్ దుకాణాలు ఏర్పాటు చేసినప్పటికీ అప్పటి రాష్ట్ర ప్రభుత్వం వాటి సంఖ్యను విస్తృత పరచలేదు. మండపేట నియోజకవర్గంలో 7, రామచంద్రపురంలో 9 మొత్తం 16 పీహెచ్‌సీలు, పలు సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రుల ద్వారా ప్రజలకు ప్రభుత్వ వైద్యం అందుతోంది. వాటికి తోడు విస్తారంగా ప్రైవేట్ ఆసుపత్రులున్నాయి. రామచంద్రపురం పట్టణంలో 3, మండపేటలో 2, ద్రాక్షారామ, కాజులూరు, కె.గంగవరంలలో ఒక్కొక్కటి చొప్పున ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల్లో జనరిక్ షాపులున్నాయి.

భారం తగ్గేదిలా...

ప్రైవేట్ షాపులలో మందులను ఎమ్మార్పీకే విక్రయిస్తున్నప్పటికీ ఆ ఎమ్మార్పీ రేటు నిర్ధారణలోనే కంపెనీలు లాభార్జనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయని ప్రజా సంఘాల నాయకులు చెబుతున్నారు. ధర అధికంగా ఉండడానికి మందుల తయారీదారులు, డిస్ట్రిబ్యూటర్లు, రిటైల్‌దారులు ఇలా పలు చేతులు మారాల్సి ఉండడం ఓ కారణమంటున్నారు. ప్రైవేట్ షాపుల విక్రయాలతో పోలిస్తే జనరిక్ దుకాణాల్లోని మందుల ధరలు 10 నుంచి 80 శాతానికి పైగా తక్కువ ఉంటుంది. పారాసిటమల్ 10 మాత్రలు ధర జనరిక్ షాపులో రూ.12 కాగా ప్రైవేట్ షాపులో రూ.20 నుంచి రూ.30 ఉంటుంది. బీపీ10 మాత్రలు ధర జనరిక్‌లో రూ.12 కాగా బ్రాండెడ్‌లో రూ.80, షుగరు 10 మాత్రలు జనరిక్‌లో రూ.15 కాగా బ్రాండెడ్‌లో రూ.50, జింక్ మల్టీ విటమిన్ 15 మాత్రలు జనరిక్‌లో రూ.20 కాగా బ్రాండెడ్‌లో 105, గ్యాస్టిక్ 15 మాత్రలు జనరిక్‌లో రూ.15 కాగా బ్రాండెడ్‌లో 135, సి విటమిన్ పది మాత్రలు ధర జనరిక్‌లో రూ.40 కాగా ప్రైవేట్ షాపులో రూ.70, డి.విటమిన్ నాలుగు కాప్యూల్స్ ధర జనరిక్‌లో రూ.40 కాగా ప్రైవేట్‌లో రూ.90 ఇలా అనేక మందుల ధరల్లో వ్యత్యాసాలున్నాయి.



రామచంద్రపురంలోని జనరిక్ మందుల షాపు

ఎన్ఎంసీఆర్ఎంపీ కొత్త నిబంధనలిలా...

జనరిక్ మందులు రాయాలంటూ 2002లోనే భారత వైద్య మండలి (ఐఎంసీ) నింబధనలను రూపొందించినప్పటికీ రాయకపోతే తీసుకోవాల్సిన చర్యలను ప్రస్తావించలేదు. 2023లో నేషనల్ మెడికల్ కమిషన్ రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్స్ (ఎన్ఎంసీఆర్ఎంపీ)ఎన్ఆర్సీఆర్ఎంపీ నియమావళి–2023 ను తీసుకురాగా అది అమల్లోకి తెచ్చినట్లు జాతీయ వైద్య కమిషన్ వెల్లడించింది. దాని ప్రకారం తమ వద్దకు వచ్చే రోగులకు చౌకగా లభించే జనరిక్ మందులను రాయాలని, రాయని వైద్యుల లైసెన్స్ రద్దు చేయడం వంటి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు చేసింది.

జనరిక్ షాపులోనే మందులను కొంటాను



వైద్యులు జనరిక్ మందులు మంచివని చెప్పారు. నాణ్యతపై అపోహలు వీడాలని సూచించారు. నాణ్యమైన మందులు సాధారణ షాపుల కంటే తక్కువ ధరకు లభ్యమవుతున్నాయి. నా కుటుంబ సభ్యుల కోసం నేను జనరిక్ షాపులోనే మందులను కొంటున్నాను.

–పీవీ రమణ, వల్లూరు, కపిలేశ్వరపురం మండలం

అపోహలు వీడాలి



జనరిక్ మందులను పూర్తి ప్రభుత్వ పర్యవేక్షణలో విక్రయిస్తారు. వాటి నాణ్యత విషయంలో అపోహలు వీడాలి. పేదలకు అందుబాటులో ఉండడం కోసం జనరిక్ మందుల ధర తగ్గించారు. దాన్ని తక్కువ నాణ్యత గల మందులుగా భావించరాదు. డాక్టరు రాసిన చీటీ మేరకు నిశ్చింతగా జనరిక్ షాపులో మందులను కొనుక్కోవచ్చు.

–డాక్టర్ పి.చంద్రమౌళి, వైద్యాధికారి, వాకతిప్ప పీహెచ్‌సీ, కపిలేశ్వరపురం